మరో మోసానికి సిద్ధమైన సీఎం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, సంగెం: రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి మరో కుట్రకు తెరలేపారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం సంగెం మండలం చింతలపల్లి, వంజరపల్లి, కృష్ణానగర్, సంగెం, కుంటపల్లి, కాట్రపల్లి, వేంకటాపూర్ గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసిన తర్వాతే ఓట్లు అడగాలని సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండ దేవుడి మీద ప్రమాణాలు చేస్తూ ప్రజలను మళ్లీ మోసం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయి గోసపడుతున్నామని ప్రజలు మొర పెట్టుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పులుగు సాగర్ రెడ్డి, దొనికల రమ శ్రీనివాస్, దోపతి సమ్మయ్య, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పెళ్లి పురుషోత్తం రెడ్డి, తోట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ రాకకు ఏర్పాట్లు

- మే 8న తిమ్మాపూర్ లో బహిరంగ సభ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : దేశ ప్రధాని నరేంద్ర మోడీ మే 8న వరంగల్ కు రానున్నారు. ఆయన పర్యటన మేరకు బీజేపీ శ్రేణులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. మొదట మడికొండలో బహిరంగ సభ నిర్వహించాలని ఆలోచన చేసి స్థలాన్ని కూడా చూశారు. కానీ అనివార్య కారణాలతో బహిరంగ సభను తిమ్మాపూర్ కు మార్చారు. శుక్రవారం తిమ్మాపూర్ లో నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని కాషాయ దళం సందర్శించింది. లక్ష మందిని సభకు తరలించడానికి బీజేపీ నేతలు కసరత్తు మొదలుపెట్టారు. మే 8న ఉదయం 11.30 నిమిషాలకు ప్రధాని మోడీ మామునూరు ఎయిర్ పోర్ట్ కు చేరుకుంటారు. 11.50 నిమిషాలకు సభ ప్రాంగణానికి చేరుకొని ప్రసంగించనున్నారు. సభా ప్రాంగణ పనులను శుక్రవారం ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రావు, శ్రీరాములు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు ఇన్ ఛార్జి ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అనిత రంజిత్, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, అసెంబ్లీ కన్వీనర్ కేశవ రెడ్డి, నాయకులు, బన్న ప్రభాకర్, సంపత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, అర్చన పాల్గొన్నారు.

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

పోస్టల్ బ్యాలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : పోలింగ్ విధులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. హనుమకొండ ఆర్డీఓ కార్యాలయంలో, ఎల్ బి కళాశాలలో పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కొరకు ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగుల సౌకర్యార్థం వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లైనా స్టేషన్ఘన్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉద్యోగుల కొరకు జిల్లా పరిషత్ హై స్కూల్ స్టేషన్ ఘన్పూర్ లో, పాలకుర్తి ఉద్యోగుల కొరకు టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ పాలకుర్తిలో, పరకాల వారికి ఆర్డీఓ ఆఫీస్ పరకాల్లో, పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్ వారికి ప్రభుత్వ పాఠశాల హనుమకొండలో వరంగల్ తూర్పు ఉద్యోగులకు లాల్ బహదూర్ కాలేజ్ నందు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఉద్యోగుల కొరకు వర్ధన్నపేట తహసిల్ కార్యాలయంలో, మామునూరు క్యాంపు లోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో అదేవిధంగా భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ ఉద్యోగులకు జెడ్ పి బాలికల ఉన్నత పాఠశాల భూపాలపల్లిలో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసిన తెలిపారు. సెంటర్లలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట ఏఆర్ఓ వెంకన్న, నోడల్ అధికారులు అజిత్ రెడ్డి, తహసీల్దార్ విజయ్, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

కళ్యాణ్ జ్యువెలర్స్ లో అగ్నిప్రమాదం..

అక్షర దర్బార్, బల్లారి: కర్నాటక రాష్ట్రంలోని బల్లారి పట్టణంలోని కళ్యాణ్ జువెలర్స్ లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఏసీ పేలడంతో ఈ ప్రమాదం సంబంధించినట్లు తెలుస్తోంది. సంఘటనకు సంబంధిం చి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నగరంలో పోలీస్ కవాతు

కవాతులో పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా స్థానిక పోలీసులు, సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో మట్టెవాడ, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ కవాతు శుక్రవారం నిర్వహించారు. ఈ కవాతను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. పోచమ్మమైదన్ లో ప్రారంభమై మండిబజార్, వరంగల్ చౌరస్తా మీదుగా రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. ఈ నందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, అర్బన్ ప్రజల ఓట్ల శాతం పెంచడంతో పాటు ఎన్నికల వేళ శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు ఈ పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. కవాతులో మూడు కంపెనీల సీఆర్పీఎఫ్, సివిల్, డిస్ట్రిక్ గార్డ్స్ పోలీసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీపీ అబ్దుల్ బారీ, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్, ఏసీపీలు నందిరాం నాయక్, దేవేందర్ రెడ్డి, తిరుమల్, సెంట్రల్ జోన్ ఇన్ స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

రానున్న 4 రోజులు

హై అలర్ట్..

అక్షర దర్బార్, హైదరాబాద్ : తెలంగాణలో రానున్న 4 రోజులు ఎండలు మరింత మండనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఇప్పటికే చాలా జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి, మహబూబ్ నగర్, భూపాలపల్లిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు దాటాయి. వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శని, ఆదివారాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, భద్రాద్రి, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతవారణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం 13జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేయగా, శని, ఆదివారాల్లో 18 జిల్లాలకు రెడ్ అలర్డ్ జారీ చేసింది. ప్రజలు ఉదయం 10గంటల తర్వాత బయటకు వెళ్లకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

34 కిలోల బంగారం పట్టివేత..

40 కిలోల వెండి అభరణాలు స్వాధీనం

అక్షర దర్బార్, హైదరాబాద్ : శంషాబాద్ లో పోలీసులు భారీగా బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ముంబయి నుంచి హైదరాబాద్ కు తరలిస్తుండగా శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో పట్టుకున్నారు. 34 కిలోల బంగారు ఆభరణాలు, 40కిలోల వెండి ఆభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆభరణాలకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

ఈనెల 20నుంచి టెట్

అక్షర దర్బార్, హైదరాబాద్ : ఈనెల 20నుంచి టెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు టీఎస్ టెట్ కన్వీనర్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20నుంచి జూన్ 2 వరకు పేపర్1, పేపర్2, తెలుగు, ఇంగ్లీషు మీడియం వారికి మ్యాథ్స్, సైన్స్, సోషన్ స్టడీస్ పరీక్ష నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రారంభమైన హోం ఓటింగ్

మే 3 నుండి 8 వరకు నిర్వహణ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : లోకసభ ఎన్నికల నేపథ్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. 85ఏళ్ల పైబడిన వారు తమ ఇంటి వద్దే ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకే ఎన్నికల సిబ్బంది వెళ్లారు. ఫారం 12-డి క్రింద 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 1010 మంది, 796 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు నమోదు చేసుకున్నారు. మే 3 నుండి 8 వరకు హోం ఓటింగ్ నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా మొదటి రోజు కొత్తవాడ, తదితర ప్రాంతాల్లో వృద్ధులు తమ ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ నిర్వహించడానికి 8685 మంది సిబ్బందికి ఎన్నికల శిక్షణ ఇచ్చారు.